## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి, మే 26 : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి ఉందని ఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేసిన బాధితుల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యలు తెలుసుకొని సకాలంలో పరిష్కరించాలని స్పష్టంచేశారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ఎస్‌హెచ్‌వోలకు ఫోన్‌లో ఎస్పీ మాట్లాడి బాధితుల వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## శిఖం భూముల్లో భారీ నిర్మాణాలపై ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి

జిన్నారం, మే 26 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శిఖం భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. వీటిలో పెద్ద ఎత్తున బిల్డర్లు బహుళ జాతి నిర్మాణాలను చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారంటూ జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలోని సర్వేనెంబర్ 71లో రేలకుంట శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయని వాపోయారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ శాఖల అధికారులు సమగ్ర విచారణ జరిపేలా చర్యలు తీసుకొని, శిఖం భూములను కాపాడాలని ఉన్నతాధికారులను ఆయన విజ్ఞప్తి చేశారు.

## 112వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు



నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలో జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మే 26 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 112వ రోజుకు చేరుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సభ్యులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివ కుమార్**



జహీరాబాద్‌లో రైతులకు పచ్చిరొట్ట విత్తన బస్తాలను అందజేస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్

జహీరాబాద్, మే 26 : పచ్చిరొట్ట విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివ కుమార్ అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట (జనుము) విత్తనాలను వాడటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. పంటలకు అధిక దిగుబడి చేకూరుతాయన్నారు. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ అధికారి భిక్షపతి మాట్లాడుతూ రాయితీపై 40 కిలోల పచ్చిరొట్ట విత్తన బస్తాను రూ. 2,510లకు అందజేయనున్నారు. ఈ విత్తన బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో డీసీఎంఎస్ కేంద్రానికి వచ్చి పచ్చిరొట్ట విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల వ్యవసాయాధికారులు లావణ్య, హస్మొద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, వీరేందర్ రాజు, మనోహర్, భూపేశ్, ప్రశాంతి, చరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వానకాలం సాగుపై రైతులకు అవగాహన

జహీరాబాద్, మే 26 : ఈ నెల 29 నుంచి జిల్లాలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రను నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి, జహీరాబాద్ మండలంలోని మిడ్గి గ్రామ శివారులోని డెక్కన్ డెవలప్‌మెంట్–కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక డీడీఎస్–కేవీకే కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు జిల్లాలోని నారాయణఖేడ్, రాయికోడ్, న్యాల్‌కల్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, సదాశివపేట్, కంగ్టి, సిర్గాపూర్, నాగల్‌గిద్దా మండలాల్లోని గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రలో భారత చిరు ధాన్యాల శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, అనుబంధ శాఖాధికారులు హాజరై వానాకాలం వ్యవసాయ పంటల సాగుపై అవగాహన కల్పించనున్నారు. ఈ అవగాహన సదస్సులకు రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సూచించారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

కంది, మే 26 : ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. ప్రభుత్వ భూమి ఉందంటే చాలు కబ్జాలు చేసి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. కంది మండలం చిద్రుప్ప–బేగంపేట గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 249 ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రేకుల షెడ్డును వేశారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు జంగారి సాయిగౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రాములు గౌడ్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయం మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ఐ పరిశీలించి ఇది ప్రభుత్వ భూమి అని ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాకూడదని హెచ్చరించి పనులు నిలిపి వేయించినట్లు తెలిపారు. సదరు వ్యక్తి అధికార పార్టీ నాయకుల అండదండలతో..అధికారుల మాటలకు భయపడకుండా షెడ్డు పనులను కొనసాగిస్తుండటంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని బేగంపేట గ్రామస్తులు కోరుతున్నారు.

### ఈ నెల 31తేదీ వరకే కొనుగోలు

మునిపల్లి, మే 26 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాల్లో ఈ నెల 31తేదీ వరకు కొనుగోలు చేస్తారని సంగారెడ్డి మార్క్ ఫెడ్ మేనేజర్ శ్రీదేవి, సంబంధిత అధికారులు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన మునిపల్లిలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి అవకతవకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### గుండెపోటుతో పంచాయతీ కార్మికుడు మృతి

హత్నూర, మే 26 : గుండెపోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన హత్నూరలో సోమవారం చోటుచేసుకుంది. హత్నూర గ్రామ పంచాయతీ కార్మికుడుగా పనిచేస్తున్న మైసగళ్ల పోచయ్య(55) సోమవారం తెల్లవారు జామున తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు.

## భూభారతి చట్టంలో లైసెన్స్ సర్వేయర్లు కీలకం

**కలెక్టర్ వల్లూరు క్రాంతి**



శిక్షణ సర్వేయర్లకు స్టేషనరీ ఫైళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 26 : భూ భారతి చట్టంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. సోమవారం లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా మహిళా సమాఖ్య భవనంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తికి ఆధార్ ఉన్నట్టు భూమికి భూదార్ ఉన్నదని పేర్కొన్నారు. భూమిలోని ప్రతి కమతానికి మ్యాప్ కీలకం కావడంతో సర్వేయర్లు చాలా అవసరమన్నారు. భూమి క్రయ విక్రయాలు, భూ బదలాయింపుల్లో, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సరిహద్దుల నిర్ణయంలో, మ్యా పుల తయారీలో, సర్వేయర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జిల్లాలో 298 మంది లైసెన్స్ సర్వేయర్ల కోసం దరఖాస్తు చేసుకోగా, 166 మందిని మొదటి దశలో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. మిగతా 132 మందిని రెండో దశలో శిక్షణ కార్యక్రమాన్ని అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. 50 రోజుల శిక్షణ కాలంలో నూతన టెక్నాలజీ సర్వేలో జోడించాలన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న లైసెన్స్ సర్వేయర్లకు స్టేషనరీ ఫైళ్లను పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు ఐనేశ్ కు మార్, సంబంధిత అధికారులు, లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ



రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

జిన్నారం, మే 26 : జిన్నారం మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని పటాన్‌చెరు ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీలను అందించి రాయితీపై జీలుగ విత్తనాలు పొందాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల రైతులకు 168 బస్తాల విత్తనాలను పంపిణీ చేశారు. మరో 150 బస్తాలు కార్యాలయానికి సాయంత్రం వరకు వస్తాయని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శంకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేశ్, నాయకులు కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, శాంత వర్మ రెడ్డి, నరేశ్, భాస్కర్, నరేందర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌ఎఫ్‌లో సీఐటీయూని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు

సదాశివపేట, మే 26 : ఈ నెల 28న ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు కార్మికులను కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో మరో చారిత్రాత్మక వేతన ఒప్పందం సీఐటీయూతోనే సాధ్యమవుతుందన్నారు. సీఐటీయూతోనే కార్మికుల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. ఇప్పటికే అనేక పరిశ్రమల్లో చారిత్రాత్మక వేతన ఒప్పందాలు చేసిన ఘనత సీఐటీయూకే దక్కిందన్నారు. కార్మికుల హక్కుల రక్షణ, ఉద్యోగ భద్రత కోసం సీఐటీయూ చుక్క గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఎంఆర్‌ఎఫ్ యూనియన్ నాయకులు నర్సింహు లు, రాజు, రమేశ్ రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, శివ కుమార్, బాగారెడ్డి, రేవనప్ప, వెంకటేశం, హాజీ, పరుశురాం, మల్లేశం, సీఐటీయూ జిల్లా నాయకులు సాయిలు, యాదగిరి, మాణిక్యం, జయరాజ్ పాల్గొన్నారు.

## జొన్నల డబ్బులు చెల్లించాలి

సంగారెడ్డి, మే 26 : జొన్నల డబ్బులను రైతులకు ఇప్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి రైతుల నుంచి జొన్నలు సేకరించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని వివరించారు. వానకాలం సీజన్ దగ్గర పడుతున్న వ్యవసాయానికి ఎరువులు, విత్తనాలు, మందులను కొనుగోలు చేయడానికి డబ్బులు లేకపోవడంతో ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని స్పష్టం చేశారు. జిల్లా అ ధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు నారాయణ, మల్లన్న, అల్లంరెడ్డి, రామకృష్ణారెడ్డి, దుర్గయ్య, నాగయ్య, విద్యాసాగర్, శంకర్‌రెడ్డి ఉన్నారు.



**వానలో చిన్నారుల ఆనందం**

పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని పార్కులో తొలకరి వానలో కొందరు బాలలు తడుస్తూ తన్మయంగా నృత్యాలు చేస్తూ కనిపించారు. వానలో తడుస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న బాలలను 'నమస్తే తెలంగాణ' కెమెరా క్లిక్‌మనిపించింది.

-పటాన్‌చెరు రూరల్, మే 26

## ప్రతి ఉద్యోగికి క్రమశిక్షణ, నిబద్ధత అవసరం..



డీఎస్పీ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం, మే 26 : ప్రతి ఉద్యోగికి ఉద్యోగం పట్ల క్రమశిక్షణ, నిబద్ధత అవసరమని అదనపు ఎస్పీ సంజీవ్‌రావు అన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఇటీవల బదిలీ కావడంతో కాటశ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీకన్వెన్షన్‌లో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సన్మాన సభకు అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఐ ప్రవీణ్‌రెడ్డి, కాటసుధారాణి, సుధాకర్‌యాదవ్, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సి.ప్రభాకర్‌రెడ్డి, రెహమాన్, దామోదర్‌రెడ్డి, బాబ్జీ, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమీషనర్ హేమంత బోర్ఖడ్‌కు వినతి పత్రం అందస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు, మే 26 : పటాన్‌చెరు డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత బోర్ఖడ్‌ను కార్పొరేట్ మెట్టు కుమార్ యాదవ్ కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కమిషనర్ హేమంత బోర్ఖడ్‌ను కలిసిన పలు సమస్యలు వివరించారు. పటాన్‌చెరులో ఉన్న అల్విన్ కాలనీలో సీసీ రోడ్లు, పార్కు అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయలని కోరారు. సీతారామపురం కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం, గాంధీ థీమ్ పార్క్ మరమ్మతులు చేసి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. జోనల్ కమిషనర్ నిధులు మంజూరు చేసేందుకు సనుకులంగా స్పందించారని తెలిపారు.

## చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య

జహీరాబాద్, మే 26 : జహీరాబాద్ మండలంలోని మల్చెల్మా గ్రామ శివారులోని చెరువులో సోమవారం మధ్యాహ్నం ఓ యువకుడు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారని జహీరాబాద్ రూరల్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి సదాశివపేట్‌లోని ఎంఆర్‌ఎఫ్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో జీవితంపై విరక్తి చెంది స్థానిక గ్రామశివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. చెరువులో నుంచి మృతదేహాన్ని బ యటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బోరుబావులు కాలుష్య జలాలుగా..

**ప్రజావాణిలో ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన రైతు నాయకుడు**



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న రైతు నాయకుడు గిద్దెరాజు

గుమ్మడిదల, మే 26 : రసాయన పరిశ్రమలు విచ్చలవిడిగా వ్యర్థజలాలను వదలడం వల్ల రైతు పంటపొలాల్లో ఉన్న బోరుబావుల్లో నీరు కాలుష్య జలాలుగా మారుతున్నాయని ప్రజావాణిలో ఆర్డీవో రైతు నాయకుడు ఫిర్యాదు చేశారు. బొంతపల్లి పారిశ్రామికవాడలోని మెట్రోకెమ్ పరిశ్రమతో పాటు సమీపంలో ఉన్న రసాయన పరిశ్రమలు నిల్వ చేసిన రసాయన వ్యర్థజలాలు వాన నీటితో పాటు ఔట్‌లెట్ల ద్వారా పంటపొలాల్లోకి వదలడం వల్ల పొలాల్లో ఉన్న బోరుబావుల్లో స్వచ్ఛమైన సాగు నీరు కాలుష్య జలాలుగా మారుతున్నాయని సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆర్డీవో రవీందర్‌రెడ్డికి బొంతపల్లి రైతు నాయకుడు గిద్దెరాజు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో పరిశ్రమకు సమీపంలో ఉన్న తన పంట పొలంలో ఉన్న బోరు నీరు కాలుష్య వ్యర్థజలాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యర్థజలాల వల్ల తమ పంట పొలాలను సాగు చేసుకోలేక ఉపాధి కోల్పోతున్నామని ఆర్డీవోకు విన్నవించారు. ఈ విషయంపై పలు మార్లు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించిన సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకొని రైతులను రక్షించాలని వేడుకున్నారు.

## ఏఎస్సైలకు ఎస్సైగా ప్రమోషన్



ఎస్పీ పారితోష్ పంకజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతులు తెలుపుతున్న పదోన్నతులు పొందిన పోలీసులు

సంగారెడ్డి, మే 26 : 35 ఏండ్లుగా పోలీసుశాఖలో విధులు నిర్వహించి, సుదీర్ఘ సర్వీసులో ఎలాంటి రిమార్క్ లేకుండా సబ్–ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసులుగా ప్రమోషన్ పొందడం విధి నిర్వహణకు మారుపేరని ఎస్పీ పారితోష్ పంకజ్ అభినందించారు. సోమవారం పట్టణంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్సైలుగా ప్రమోషన్ పొందిన ఏఎస్సైలకు స్టార్ గుర్తులను తొడిగి అభినందించారు. ఈ ప్రమోషన్లను మల్టీజోన్–2 ఐజీ వి. సత్యనారాయణ ఏఎస్ఐలకు ఎస్సైలుగా ప్రమోషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1990లో పోలీసు కానిస్టేబుల్స్‌గా నియామకమై గడిచిన 35 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లా పోలీసు శాఖలో విశిష్ట సేవలందించిన, ప్రస్తుతం జిల్లా లో పనిచేస్తున్న పోలీసులకు ఎస్సైలుగా ప్రమోషన్ కల్పిస్తూ మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు వెలువరించారని ఎస్పీ గుర్తుచేశారు. ప్రమోషన్లు పొందిన వారిలో గంగయ్య, సుధాకర్, శ్రీహరి, సంజీవ రెడ్డి, షాబుద్ రహమాన్, లక్ష్మీనారాయణ, దుర్గయ్య, నారాయణ, మల్లేశ్వర్, భిక్షపతిలను అభినందించి ఎస్సై ర్యాంకు చిహ్నాలను అ లంకరించారు. ఎక్కడి విధులు నిర్వహిస్తున్న ప్రజలతో మమేకమై శాంతియుత వాతావరణాన్ని పెంపొందించాలని ఎస్పీ సూచించారు.

## రుక్మాపూర్‌లో మహిళ దారుణ హత్య



రాణెమ్మ (ఫైల్)

జహీరాబాద్, మే 26 : ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ మహిళను దుండగులు హత్య కు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోరేంచ రాణెమ్మ (48) మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలం యూసుఫ్‌పూర్‌కు చెందిన మల్లన్నతో 20 ఏండ్ల కింద వివాహం జరిగింది. భార్యా భర్తల మధ్య గొడవలు రావడంతో విడాకులు ఇచ్చి అప్పట్టి నుంచి ఆమె తన తల్లిగారి ఇళ్లు రుక్మాపూర్‌లోనే ఉం టుంది. ఆదివారం తల్లి బిచ్చమ్మ జహీరాబాద్ పట్టణంలో ఉంటున్న చెల్లెలు ఇంటికి వెళ్లడంతో ఆమె ఒక్కరే ఇంట్లోనే ఉంది. నిద్రిస్తున్న ఆమె ఇంట్లోకి చొరబడి గొంతు నులిపి, తలపై రాయితో కొట్టి హత్య చేసిన గుర్తు తెలియని దుండగులు ఒంటిపై ఉన్న బంగారు అభరణాలతో పాటు, బీరువాను పగలగొట్టి నగదు, బంగారాన్ని దొంగిలించి పారిపోయారు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు చెత్తసేకరించేందుకు రాణెమ్మ ఇంటి వద్దకు వెళ్లారు. ఎంత అరిచినా ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై విగత జీవిగా పడిఉన్న రాణెమ్మను చూసి బయటకు వచ్చి ఇరుగుపొరుగు వారికి తెలిపారు. వెంటనే స్థానిక గ్రామస్తులు హద్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు హద్నూర్ పోలీసులతో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యను పాల్పడిన అనవాళ్లను గుర్తించేందుకు సంగారెడ్డి నుంచి డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిస్ నిపుణులను గ్రామానికి రప్పించారు. మహిళ హత్యకు పాల్పడిన దుండగుల కోసం ఘటన స్థలం నుంచి డాగ్ స్క్వాడ్ సిబ్బంది గాలి స్తూ గ్రామ బస్టాండ్ వరకు వెళ్లి వచ్చారు. అనవాళ్లను గుర్తించేందుకు ఫోరెన్సిస్ నిపుణులు ఘటనా స్థలంలో వేలిముద్రాలను సేకరించారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హద్నూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి

ఝరాసంగం, మే 26 : మండల పరిధిలోని బర్దిపూర్‌లో నూతన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, నాయకులు ఉజ్వల్ రెడ్డి, ఆశ్రమ పీఠాధిపతులు మహామండలేశ్వర సిద్ధేశ్వరానంద గిరి మహారాజ్, అవధూత గిరి మహారాజ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ ఆరోగ్య మందిర్ బర్దిపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వారికి ఆశ్రమ పీఠాధిపతులు సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గాయత్రిదేవి, మండల వైద్యాధికారిణి డాక్టర్ రమ్య, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని భారతీయ విద్యా మందిర్ పాఠశాలలో 10వ తరగతి 2000–2001వ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం పట్టణంలోని ఓ ప్రైవే ట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.

-సంగారెడ్డి, మే 26

### అర్హులకు ఇందిరమ్మ బిల్లులు చెల్లిస్తాం

కోహీర్, మే 26 :ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకుంటున్న ప్రతి ఒక్కరికీ బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా పీడీ చలపతిరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాజనెల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజనెల్లిలో 27మందికి ఇండ్లను మంజూరు చేశామని వెల్లడించారు. బిల్లులు రావనే అపోహ వద్దన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసిన వెంటనే ఫొటో నమోదు చేస్తే వారంలో బిల్లులు వస్తాయన్నారు. ఆయన వెంట డీఈఈ మా ధవరెడ్డి, ఆనంద్, తదితరులు ఉన్నారు.

**జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా**

### స్వామి బాధ్యతల స్వీకరణ



డిపో మేనేజర్ స్వామి

జహీరాబాద్, మే 26 : జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా స్వామి పదవీ బాధ్యతలను స్వీకరించారు. సోమవారం స్థానిక డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక డిపో మేనేజర్‌గా పనిచేసిన జాకీర్ హుస్సేన్ బదిలీపై వెళ్లడంతో ఘనంగా సత్కారించి వీడ్కోలు పలికారు. కొత్తగా డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చిన స్వామి బాధ్యతలను చేపట్టారు. స్థానిక డిపో అధికారులు, సిబ్బంది కొత్తగా డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వామికి స్వాగతం పలికి అభినంధనలు తెలియజేశారు.

### బిలాల్‌పూర్‌లో 'బడిబాట'



బిలాల్‌పూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోహీర్, మే 26 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని హెచ్‌ఎం సురేశ్ కోరారు. సోమవారం మండలంలోని బిలాల్‌పూర్‌లో బడిబాటను నిర్వహించారు.

**సిర్గాపూర్‌లో..**

సిర్గాపూర్, మే 26 : సర్కారు బడిలో నాణ్యమైన విద్యనందిస్తామని, పిల్లలను వెంటనే బడిలో చేర్పించాలని వాసర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంగ్రాం అన్నారు. వాసర్‌లో ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి బడికి పంపాలని కోరారు.

**రాయికోడ్‌లో..**

రాయికోడ్, మే 26 : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య బోధన ఉంటుందని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. రాయికోడ్‌లో బాడిబాట కార్యక్రమంలో భాగంగా ఇం టింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

### బీరంగూడ ఆలయంలో తహసీల్దార్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్

అమీన్‌పూర్, మే 26 : బీరంగూడ మల్లికార్జున భ్రమరాంబిక దేవస్థానం లో అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన తోపాటు ఆర్ఐ రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి తీర్థ ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యదవ్ అర్చకులు ప్రహ్లాద్ తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, మా క్లయింట్ శ్రీమతి కె.విజయ లక్ష్మి భర్త కె.సుదర్శన్ గారు వైలాల్ గ్రామం,జిన్నారం మండలం, సంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నెం. 541/AA/1లో ఎక.0-21 గుంటలు మరియు సర్వే నెం.541/AA/2లో ఎక. 0-21 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూములను వాటి ఒరిజినల్ పట్టాదారులు శ్రీ పట్నం అంజయ్య తండ్రి లక్ష్మయ్య మరియు శ్రీ పట్నం లక్ష్మీనారాయణ తండ్రి లక్ష్మయ్య వారి నుండి కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తున్నారు మరియు బయానా మొత్తాన్ని చెల్లించారు మరియు పై పట్టాదారులతో అమ్మకం ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఎవరికైనా పైన తెలిపిన భూములలో ఏదేని ప్రయోజనం మరియు ఏవేని అభ్యంతరాలు కలిగి ఉన్నచో ఈ ప్రకటన తేదీ ప్రచురణ తేదీనుండి ఒక వారం రోజుల్లోగా మా కౌన్సిల్‌ను సంప్రదించగలరు, నిర్ణీత సమయంలోగా ఏవిధమైన అభ్యంతరాలు అందనిచో మా క్లయింట్ తదుపరిగా ముందుకు సాగుతారు మరియు పై పట్టాదారుల నుండి పైన తెలిపిన భూములను కొనుగోలు చేస్తారు మరియు 7 రోజుల తర్వాత అందిన ఏవేని క్లెయింలు లేదా అభ్యంతరాలు అనుమతించబడవు.

ఇందునిమిత్తమే ఈ ప్రకటన జారీ చేయబడినది.

సం/- ఎ.జగన్ మోహన్ రెడ్డి,
అడ్వకేట్స్
10-4-99/32, అల్తాఫ్ నగర్, బైరమల్‌గూడ,
రంగారెడ్డి జిల్లా, ఫోన్: 7386005205